
# పిచ్చిగీతలు




## పి.వి.ఆర్. శివకుమార్

నిన్న రాత్రిదాకా ఉషారుగానే కబుర్లు చెప్పాడు. "నేనసలు ఇక్కడికి యింక రానేరాను. నాన్నగారితో కలిపి అక్కడే వుండిపోతా" నన్నాడు. "తమ్ముడు, అమ్మ అక్కడకు వచ్చేదాకా అన్నం కూడా నేనే వండుతా"నన్నాడు. "అన్నమంటే ఏముందీ, బియ్యంలో నీళ్ళుపోసి గ్యాస్ స్టవ్ మీద పడేస్తా. అది బుడ బుడమనీ అన్నం అయిపోయి, మూతని కిందికి తోసేస్తుంది. అప్పుడు ఆ గిన్నెని దించేస్తా" అన్నాడు. ఇంకా యిలాటి కబుర్లే ఎన్నో....

అలాంటిది ఉదయం లేచినప్పట్నుంచీ వాడి వైఖరిలో మార్పు రానే వచ్చింది. అది సహజమే కనక ఎవరూ ఆశ్చర్యపడలేదు గానీ, పిల్లవెధవ బెంగెట్టేసుకుంటాడేమోనని బాధ పడ్డారు.

"అమ్మా, ఇవాళేనా నేనూ నాన్నగారూ వూరెళ్ళేది?" అడిగాడు ఉదయం లేవగానే రాజు.

"అవున్రా!" అంది విశాల రెండోవాడికి జుబ్బా తొడుగుతూ. వాడింకేం మాట్లాడలేదు.

"ఏరా రాజూ! వెళ్ళవా నాన్నగారితో?" వాడి మౌనం, వాడి ముఖంలో కమ్ముకున్న దైన్యం చూస్తూ అడిగింది విశాల.

"వెళ్తా" బింకంగా అనేసి పక్కమీంచి దిగాడు రాజు. ముఖం కడుగుతుంటే వాడి కళ్ళలో నీళ్ళు తిరగటం గమనించింది విశాల.

"ఏడుస్తున్నావా?" అంది లాలనగా. తల గబ గబ అడ్డం తిప్పాడుగానీ, గొంతులో దుఃఖం అడ్డు పడటంతో నోటితో కాదని చెప్పలేకపోయాడు వాడు. విశాలకీ గుండెల్లో కలుక్కుమంది.

"నాలుగేళ్ళయినా నిండనివాడు. ఇంత వరకూ ఒక్కరోజయినా తనని విడిచి వుండనివాడు. చదువుల కిప్పుడు ఏమంత

తొందర మించిపోయిందని? కానీ ఆయన పట్టుదలా క్రమశిక్షణా ఆయనవి!

"మరో పదిరోజుల్లో మంచిరోజు చూసుకుని నువ్వు రానే వస్తావు. ఈ పది రోజులూ పని పిల్లని మన యింట్లోనే వ...డమని చెప్పాను కదా. నేనూ వుంటాను. ...లాగో అలా మానేజ్ చేస్తాను. అంతేగాని పది రోజుల భాగ్యానికి పిల్లని ఆ యిం...వ్యూకి తీసుకు వెళ్ళకుండా ఏడాది కాల... వృధా చేసెయ్యమంటావా?" అంటారు.

ఓ విధంగా చూస్తే ఆ మాటా ...జమే.

రాజు ముఖం తుడిచి, యింట్లో... తీసుకు వచ్చిందామె. బోర్నవిటా కలిపి గ్లా... చేతికి యిచ్చింది. తాగకుండా అలానే చూస్తూ కూర్చున్నాడు రాజు.

"తాగు నాన్నా" అంది విశాల.

"అమ్మా.... రేపట్నుంచీ బో...నవిటా నేనే కలుపుకోవాలా?"

"ఎందుకమ్మా-నాన్నగారు కలి... యిస్తారుగా" అంది ఆమె. "ఓరివెధవా, అన్న... కూడా నువ్వే వండిపెడతానన్నావుగా మీ ...న్నకి" అంది విశాల తల్లి నవ్వుతూ.

"నేనేం చెయ్యను-నేనసలు ...మ్మను వదిలి వెళ్ళనే వెళ్ళను" చేతిలో గ్లా... కింద పెట్టేసి అంతవరకూ మనసులో గు... కట్టుకున్న గుబులంతా బయట పెట్టేస్తూ ఏడుపు మొదలుపెట్టాడు రాజు - విశాల వా...కి తల దూర్చి.

ఆయిదు నిముషాలసేపు వ...నలాగే వొదిలేసింది విశాల-తర్వాత, త... కళ్ళు రెండూ పమిటచెంగుతో వొ త్తుకు... అంది:

"తప్పు నాన్నా, అలా ఏడవ ...డదు. లే లే! మంచిపిల్లలు అలా ఏడుస్తార... నువ్వు మరి మన అంకుల్ వాళ్ళ భానులాగా ...వ్వెంటు బడికి వెళ్ళవూ?"


నెమ్మదిగా తలెత్తి అడిగాడు ...జు.

"భాను కూడా బడికి వస్తాడా!"

"ఓ! ఎందుకు రాడు? రేపు నీతో యింటర్వ్యూకి కూడా వస్తాడు. తర్వాత బడికీ వస్తాడు.

ఒక్క వారం రోజులుపోతే, అంటే ఇవాళ ఆదివారమూ—మళ్ళా ఆదివా...నాటికి నేను, తమ్ముడు, అమ్మమ్మ....అందరం అక్కడికి వచ్చేస్తాం. అప్పుడు నువ్వు చక్కగా బళ్లో చేరిపోతావ్! అ...తదాకా ఏడవకుండా నవ్వుతూ ఆడుకోవాలి. ఏం?"

నెమ్మదిగా తలూపాడు రాజు.




"ఏదీ, యింటర్వ్యూలో నీ పేరేమిటీ అంటే ఏం చెప్తావ్?"

"జి. విజయరామరాజు" గబుక్కున చెప్పాడు రాజు.

"అదీ! అలా చక్కగా చెప్పాలి అన్నింటికీ" నెమ్మదిగా మాటల్లో పెట్టి వాడిలో గూడు కట్టుకుంటున్న బెంగని తొలిగించే ప్రయత్నం ప్రారంభించింది విశాల.

* * *

కొడుకుని వెంటపెట్టుకు మధ్యాహ్నం బస్‌లో బయల్దేరిన అనంతరావు రాత్రికి హైద్రాబాద్ చేరుకున్నాడు. ఆటోలో యిల్లు చేరుకునేసరికి ఏడుగంటలయింది. తను స్నానం చేసి, వేడినీళ్ళు పెట్టి కొడుక్కీ నీళ్ళు పోశాడు. తర్వాత బయటికి వచ్చి, దగ్గరలోని ఓ హోటల్లో భోజనంచేసి, వాడికీ కాస్త పెట్టాడు.

ఇల్లు చేరుకున్నాక, వాడిని దగ్గర కూర్చోపెట్టుకుని, మర్నాటి ఉదయం ఇంటర్వ్యూకి సన్నద్ధుణ్ణి చెయ్యటం ప్రారంభించాడు. ఇంగ్లీషులోనూ, తెలుగులోనూ కూడా తన పేరు, భార్యపేరు చెప్పించాడు. తన వుద్యోగము చెప్పించాడు. ఇంటి అడ్రసు చెప్పించాడు. తరవాత ఇంగ్లీషు అక్షరాలన్నీ చూపి గుర్తు పట్టించాడు. ఇంకా అలాటివే తను అవసరమనుకున్నవన్నీ చెప్పాడు.

"రాజూ, రేపు బళ్లోకి వెళ్తాం మనం. అక్కడ పెద్ద పెద్ద టీచర్స్ వుంటారు. హెడ్ మిస్ట్రెస్ వుంటారు. వాళ్ళు కూడా నిన్ను ఇలాగే ప్రశ్నలు అడుగుతారు. నువ్వుచక్కగా తడుముకోకుండా జవాబులు చెప్పాలి. ఒక వేళ ఏదయినా తెలియని ప్రశ్న అడిగితే భయపడి పోకూడదు. ధైర్యంగా, 'నాకు తెలీదు టీచర్' అని చెప్పేయాలి. దేనికీ భయపడకూడదు. తడబడిపోకూడదు. వాళ్ళు అంతా మంచి టీచర్స్. నువ్వు బాగా జవాబులు చెప్తే నిన్ను స్కూల్లో చేర్చుకుంటారు. చెప్తావా?" లాలనగా అడిగాడు.

"చెప్తాను" తలవూపుతూ అన్నాడు రాజు.

"గుడ్" కొడుకు భుజం తట్టి, లైటు తీసేశాడు అనంతరావు. మంచం మీద వాలి, కొడుకుని పక్కనే పడుకోబెట్టుకున్నాడు.


"భయం వేస్తోందా?" అడిగాడు.

'అవును కాద'న్నట్టు తల గిర గిరా తిప్పాడు రాజు.

"ఏం భయం లేదు నాన్నా, నేనున్నానుగా! నీకేదన్నా భయంవేస్తే నాన్నా అని పిలూ. నేను పలుకుతా" ధైర్యం చెప్పాడు అనంతరావు.

"ఊఁ" అన్నాడు రాజు.

"తన కొడుకు యెలాగయినా చురుకే" మనసులో అనుకున్నాడు అనంతరావు. అతనికి సడెన్‌గా షణ్ముగం గుర్తుకు వచ్చాడు. షణ్ముగం అతని స్నేహితుడు. డి.ఇ.వో. గారికి పి.యేగా వుంటున్నాడు. అనంతరావు డి.ఇ.వో. ఆఫీసు దగ్గర్లోనే వున్న ఓ గవర్నమెంట్ ఆఫీసులో అకౌంటెంటు. లంచ్‌లో ఇద్దరూ ఒకే హోటల్‌కి వస్తుండటంతో వాళ్ళకి పరిచయం జరిగి, అది ఓమాదిరి స్నేహంగా బలపడింది. అప్పుడప్పుడు ఒక




రింటికి ఒకరు వెళుతుండటాన కుటుంబాల మధ్యా స్నేహం ఏర్పడింది. షణ్ముగం కొడుకు భాను స్వతహాగా పిరికి. రాజు చురుకుదనం చూసి షణ్ముగం భార్య వుడుక్కుంటుంది. కానీ, రాజు సాహచర్యం వల్లనే కొంతలో కొంత పిరికిదనం పోగొట్టుకున్నాడు భాను.

“డి. ఇ. వో. గారికి చెప్పాను భాయ్. మా అబ్బాయి సీటు గురించి చెప్తానన్నారు. మీ అబ్బాయి సంగతి చెప్పాను. చూస్తానన్నారు” అన్నాడతను నిన్ననే- అనంతరావుతో.

అనంతరావుకి నమ్మకం లేదు తన కొడుకు విషయం డి. ఇ. వో గారు చెప్తారని. కాకపోతే షణ్ముగం కొడుక్కే సీటు యిచ్చే పక్షంలో, అంతకన్నా అనేకరెట్లు చురుకయిన తన కొడుక్కి యివ్వరా అని అతని ధైర్యం.

“ప్చ్.... మా చిన్నప్పుడు ఒకటో క్లాసు కన్న తక్కువ క్లాసులూ లేవు. సీట్లకోసం యింత చేటు కాట్లాటలూ లేవు!” నిట్టూరుస్తూ అనుకున్నాడు అనంతరావు.

* * *

కారిడార్లో వున్న జనాన్నీ, పార్కింగ్ స్పేస్‌లో ఆగివున్న కార్లూ, స్కూటర్లనీ చూడగానే ఆటోలోంచి దిగిన అనంతరావుకే కళ్లు చెదిరాయి. రాజు తండ్రి చెయ్యి గట్టిగా పట్టుకుని వొదల్లేదు.

“అబ్బ! యింత పోటీయా! వున్న పాతిక సీట్లకి కనీసం డెబ్భై ఎనభై మంది వచ్చినట్టున్నారే!” అనుకున్నాడు.

నెమ్మదిగా తనూ వెళ్ళి వాళ్లలో కలిశాడు. షణ్ముగం అప్పటికే అక్కడున్నాడు. అనంతరావుని చూసి పలకరింపుగా నవ్వాడు. భానుని చూశాక రాజు మొహంలో బెరుకుదనం కొద్దిగా తగ్గింది.

“అబ్బ! చాలామంది వున్నారే” అన్నాడు అనంతరావు.

“అవును మరి. ఈ స్కూల్లో సీటు రావటం అంటే ప్రెస్టీజ్ సింబల్ కదా! మినిస్టర్ల పిల్లలు కూడా వచ్చారు ముగ్గురు” నవ్వాడు షణ్ముగం.

ఇంటర్వ్యూలు ప్రారంభమయ్యాయి.

రాజుకీ పిలుపు వచ్చింది. ముందు రాత్రి కూడా టక టకా జవాబులు చెప్పిన రాజు ఇంటర్వ్యూలో ఒకటే ప్రశ్న రెండేసిసార్లు స్తుండటం, అడిగేవాళ్ల గొంతులో తండ్రి గొంతులోని మృదుత్వం కాక, కరకుదనం నలాడటంతో కొంత ఖంగారుపడ్డాడు - కొంత భయపడ్డాడు. వెరశి, జవాబులివ్వటంలో తడబడ్డాడు. అలా తడబడ్డ కొడుకువంక ఓటమి తలపుతో భయపడిన అనంతరావు వురిమి చూశాడు. దాంతో రాజు గొంతు మూగబోయింది. చివర్లో అడిగిన ప్రశ్నలకు తెలిసీ జవాబు యివ్వలేకపోయాడు.

ఇంటర్వ్యూ ముగిసింది.

రిజల్ట్సు సాయంత్రం నాలుగింటికి చెప్తామన్నారు. కొడుకుని యింటిదగ్గర పనిపిల్ల దగ్గర దింపేసి ఆఫీసుకి వెళ్లిపోయాడు అనంతరావు.

* * *

సాయంత్రం నాలుగింటికి ఫోన్ చేశాడు అనంతరావు. రిజల్టు అనుకున్నవి[illegible] వుంది. రాజుకి సీటు రాలేదు. షణ్ముగం కొడుక్కి వచ్చింది.

షణ్ముగంమీద వుక్రోషమూ, తన కొడుకు మీద కోపమూ కలగాపులగంగా చెలరేగాయి అతన్లో. సరాసరి యింటికి బయల్దేరాడు

హాల్లో కూర్చుని వున్నాడు బిక్క మొహంతో రాజు. పక్కనే కూర్చునుంది పనిపిల్ల. తండ్రిని చూడగానే లేచి నిలబడ్డాడు రాజు.

“నాన్నగారూ, నేను అమ్మ దగ్గరకు వెళ్ళిపోతా!” అన్నాడు.

మనసులోని కోపం బయటకు వురికింది అనంతరావులో.

“అంతే, ఇహ అమ్మ దగ్గర కూచుని అంట్లు తోమటం నేర్చుకోవలిసిందే నువ్వు, పిరికి వెధవా!” అరిచాడు అతను.

బావురుమన్నాడు రాజు. తండ్రి తనని తిట్టటం వాడికి సరికొత్త అనుభవం.

“షటప్! డర్టీ ఫెలో” చేత్తో వాడి పెడరెక్క పుచ్చుకుని కూలేశాడు అనంతరావు.

మరింత బెదిరిపోయిన రాజు భయంకొద్దీ గొంతు నొక్కుకుని ఏడుపుని వెక్కిళ్ళలోకి దించేశాడు. వాడి నలాగే వదిలేసి, తన పనిలో పడ్డాడు అనంతరావు.

ఆ రాత్రి భోజనంచేసి పడుకునేవరకూ బిక్కు బిక్కుమంటూ అలాగే తిరిగేడుగానీ, తండ్రితో మరేం మాట్లాడలేదు రాజు. పడుకున్న తరువాత, తండ్రి మామూలు మూడ్‌లో వున్నాడనిపించాక అడిగాడు:

“నాన్నగారూ! నేను బళ్లో ఎప్పుడు చేరాలి?”

అనంతరావుకి మళ్లీ కోపం ముంచుకొచ్చింది. కానీ తమాయించుకుని చెప్పాడు.

“నిన్ను ఆ స్కూల్లో చేర్చుకోరు.”

“ఏం?” బిత్తరపోయి అడిగాడు వాడు.

“నీకు వాళ్లు సీటివ్వలేదు. నువ్వు ఇంటర్వ్యూ బాగా చెయ్యలేదు.”

“అంటే?”

“అంటే... నువ్వు వాళ్లడిగిన వాటికి సరిగా జవాబులు చెప్పలేదు.”

వాడి మనసులో ఏమనుకుంటున్నాడో తెలియదుగానీ బయటికి మాత్రం ఇంకేం అనలేదు రాజు. కామ్‌గా పడుకుండిపోయాడు. పావుగంట గడిచాక నెమ్మదిగా అడిగాడు:

“నాన్నగారూ! మరి నేను ఎక్కడ చదువుకోవాలి?”

"ఎక్కడి చదువుతావ్? ఇంట్లోనే చదువుకోవాలి. బళ్లో చేర్చుకోకపోతే ఏం చేస్తావు మరి?"

గంభీరంగా జవాబిచ్చి, చదువుతున్న వీక్లీ లోకి మునిగిపోయాడు అనంతరావు.

ఆ తరవాత నెమ్మదిగా నిద్రలోకి మునిగిపోయాడు.

అర్ధరాత్రి దాటేక, హఠాత్తుగా మెలుకువొచ్చింది అనంతరావుకి. పక్కనే వున్న రాజు కలవరిస్తున్నాడు: కలవరింతలోనే ప్రశ్నలు-జవాబులు అన్నీ చెప్తున్నాడు!

కొడుకుమీద జాలేసింది అనంతరావుకి. వాణ్ని దగ్గరకు లాక్కుని, తలమీద చెయ్యి వేసి పడుకున్నాడు.

* * *

తెల్లారి లేచేసరికి రాజు వొళ్లు పేలిపోతోంది. అనంతరావు కంగారు పడ్డాడు. రాత్రికి రాత్రే అంత జర్వం ఎందుకొచ్చిందో అతని కర్థం కాలేదు. జ్వరంతో వాడు కళ్లు తెరిచిన పడటం లేదు. ఉండి, వుండి కలవరిస్తున్నాడు:

'నేను బడికి వెళ్తా నాన్నగారూ... ఇంట్లో చదువుకోను.'

'ఇవాళ మళ్ళీ వెళ్దాం నాన్నగారూ.... ఈ సారి ఇంటర్వ్యూ బాగా చేస్తాను.

'మైనేమీజ్....ఫాదర్స్ నేమీజ్...'

అనంతరావు బేజారెత్తిపోయాడు.

'ఇదేం ఖర్మ? సంధి పలవరింతలూ, పీడూను!'

గుబగుబ ముఖం కడుక్కుని, బాబుచేత కూడా కడిగించి కాసిని పాలు వెచ్చచేసి తాగించాడు. వెంటనే బట్టలేసుకుని, వాణ్ణి భుజాన వేసుకుని పక్క వీధిలో వున్న డాక్టర్ దగ్గరకు వెళ్లాడు.

డాక్టర్ ప్రకాశం ఆ ఉదయాన్న కాస్త ఖాళీగా వేవున్నాడు. అనంతరావుని చూడగానే

"రా! రా! ఏమిటి బాబుకి వంట్లో బాలేదా? అంతేలే, వీక్కూడా యెవరికన్నా వంట్లో బావులేకపోతే తప్ప రావటం కుదర్లేదు కదూ!" అన్నాడు.

అనంతరావు చిరునవ్వు పేలవమైనది ఒకటి పడేసి,

"తీరిక వున్నప్పుడల్లా వస్తూనే వున్నాను కదుట్రా." అంటూ రాజుని అక్కడే వున్న కుర్చీలో కూర్చోపెట్టాడు.

గబ గబ జ్వరం చూశాడు ప్రకాశం.

"ఎప్పట్నించి?" అడిగాడు. చెప్పాడు అనంతరావు. మళ్ళా పలవరింతలు మొదలెట్టాడు రాజు. జ్వర తీవ్రత తగ్గేందుకు ఓ ఇంజక్షన్ చేశాడు ప్రకాశం.

"లలితా!" అంటూ లోపలికి చూస్తూ పిలిచాడు, "బాబుని లోపల పడుకోబెట్టు"

"నమస్కారమండీ! అక్కయ్యగారు బాగున్నారా? ఎప్పుడొస్తున్నారు?" అనంతరావుని పలకరించిన లలిత, రాజు వైపు చూసి కంగారు పడింది.

"వీడినెప్పుడు తీసుకొచ్చారు? ఈ జ్వరం యెప్పటినించి?"

చెప్పాడు అనంతరావు - ఇంటర్వ్యూ గురించి కూడా. ఆమె వాడినెత్తుకుని లోపలికి వెళ్ళింది.

"సో.... అదన్న మాట సంగతి."

డ్రాయర్లోంచి ఫోర్స్క్వేర్ పాకెట్ తీసి, సిగరెట్ వెలిగిస్తూ అన్నాడు ప్రకాశం, "అందుకే నా ఆ కలవరింతలు?"


"అవును. సీటు రాలేదని బాగా బెంగ పడ్డట్టున్నాడు."

అనంతరావు మాటలకి ఛర్రున కోపం వచ్చింది ప్రకాశానికి.

"ఆ బెంగ పోగొట్టటానికి నువ్వేం చేశావ్? మరో నాలుగు మాటలు వాడినే అన్నావ్ అంతేనా?"

"జ్వరం రావాలనీ వాడికేదో కావాలనీ అంటానేమిట్రా? ఇంత శ్రమపడి, నాలుగొందలు డొనేషన్ కట్టడానికి సిద్ధపడి వీడిని తీసుకువెళ్తే అదంతా బూడిదలో పోసిన పన్నీరయిందన్న బాధలో కసిరేను...."

"పిల్లల సైకాలజీ తెలీని వాళ్ళకి పిల్లల్ని కనే హక్కు వుండకూడదురా అందుకే! నువ్వే అనేమిటి-దేశంలో చాలా మంది న్నారు...."




ప్రకాశానికి కోపం రాదు. వస్తే వాళ్లు తెలీదు ఆ సంగతి చదువుకునే రోజుల్నుంచీ తెలిసిన అనంతరావు మాట్లాడకుండా వూరుకున్నాడు.

"పసి వెధవ. వాడి వయసెంత? మూడేళ్ళ కొన్ని నెలలు! వాడే కాదు, నిన్న అక్కడి కొచ్చిన పిల్లలందరూ ఆ యీడు వాళ్ళే కదా!

ఇంతప్పటినించీ వాళ్ళలో 'పోటీ' ని నూరిపోయటమే కదా మనం చేస్తోంది! ఎదటి వాడిని మించి పోకపోతే, ఎవడి బతుకు వాడు బతికే అవకాశం యీ ప్రపంచంలో లేదనే కదా మనం వాళ్ళకి చెపుతోంది! ఈజిట్ ఎడ్వైజబుల్?"

"ఓ విధంగా నువ్వన్నది నిజమే! కానీ మరి వున్న పాతికసీట్లకోసం అంతమంది వచ్చినప్పుడు...."

"హెల్ విత్ యువర్ పాతిక సీట్స్ ఐసే! ఏం కొంప మునిగి పోతుంది ఆ పాతికలో ఒకటి మన్ది కాకపోతే?" అరిచాడు ప్రకాశం, "దేశంలో....మనవూళ్లో ఇంక బళ్ళేవేవా?"

"ఏమిట్రా అలాగంటావ్? రేపు నీకో కొడుకు పుడితే నీకూ తెలుస్తుంది. మన వూళ్ళో ఆ స్కూల్ కి యెంత పేరుందో నీకు తెలీదా? మినిస్టర్ లెవెల్ రెకమెండేషన్స్.. అంతెందుకు ఆ షణ్ముగం నీకు తెల్సుగా.... వాళ్ళబ్బాయి....ఉత్త 'మమ్'....వాడికొచ్చింది సీటు....రికమెండేషన్ తో...."

"వాడికి సీటొచ్చిందని నీకు రోషమొచ్చింది! చూడు, మూడేళ్ల వయసునించే పసిపిల్లల మనసుల్ని మనం అడల్టెరేట్ చేసి పారేస్తున్నా మన్నమాట! 'షణ్ముగం అంకుల్ వాళ్ళ బాబుకి, సీటొచ్చింది - నాకు రాలేదు. అంటే వాడికంటే నేను వెధవని' అన్న ఇన్ఫీరియార్టీ-లేదా, 'ఆ భానుగాడు సరిగ్గా మాట్లాడను కూడా లేడు-నేనించక్కా జవాబులు చెప్తాను. అయినా నాకు సీటు రాలేదు.' అన్న జెలసీ-ఇవేగా మనం వాళ్ళకి ఇంజక్ట్ చేస్తున్న భావాలు!

ఇంతప్పటినించే వాళ్ళ లేత మనసుల్ని కలుషితం చేసి, వాళ్ళని డిస్క్వాలిపై చేయటం మొదలెట్టడమేగా ఇదంతా! వాళ్ళ నిష్కల్మషమయిన తెల్లని మనసులమీద పిచ్చి గీతలు గీయటమేగా!

'నన్ను బళ్ళో చేర్చుకోనన్నారు. అంటే నేను చదువుకోవటానికి పనికిరాను' అన్న భావం వాళ్ళ పసి మనసులో పడితే దాని ప్రభావం ఎంతవరకూ పోతుందో ఎవరయినా ఆలోచిస్తున్నామా? ఆ ఆత్మన్యూనతా భావంతో వాళ్ల పసి మనసులు ఎంత చెదిరిపోతున్నాయో, వాళ్ళు మరెంత ముడుచుపోయే మనస్తత్వం పెంపొందించుకుంటున్నారో మనం అర్థం చేసుకుంటున్నామా?

ఇంతా చేసి ఎందుకు గ్లామర్ కాన్వెంట్ ఇన్స్టిట్యూట్ మీద? వాళ్లు వందల వేలు డబ్బు గుంజుతున్నందుకు! చిలక పలుకుల్లా ఇంగ్లీషు ముక్కలు నేర్పుతున్నందుకు! అంతకు మించి ఏముంది వాటిల్లో-బూడిద! అయినా, మూడేళ్ల పసివాళ్లు సిగ్గూ, భయంతో వుంటే తప్పేమిట్రా? మనమంతా హైస్కూల్ వదిలేవరకూ కూడా యెంత పిరికి వెధవల్లా వుండేవాళ్లం? మన తరంలో కాలేజీ యెడ్మిషన్‌కి అప్లికేషన్ రాయటం కూడా రానివాళ్ళు యెందరు లేరు? వాళ్లంతా యెందుకూ పనికిరాకుండా వున్నారా?

వేలకి వేలు తగలేసి, ఇప్పట్నించే వీళ్లని ఆ కాన్వెంట్స్‌లో చేర్చటం, వీళ్లు దేశంలో సామాన్యుల బతుకులగురించి ఏమీ తెలీకుండా బూర్జువా మెంటాలిటీలు పెంపొందించుకోవటం, 'గెట్ మీ పైవర్ మమ్మీ గెట్ మీ పెన్సర్ డేడీ' అంటూ బతకటం. ఇంతా ఏడిపి హైస్కూల్ లెవల్ దాటేక వాళ్ళు చేరేదీ అదే కాలేజీల్లో కదూ?"

"కానీ ఫౌండేషన్...."

"నాన్సెన్స్! ఫౌండేషన్ గట్టి చెయ్యటానికి నువ్వులేవా, వాళ్ళ అమ్మలేదా! నువ్వు ఎమ్మెస్సీ ఫస్ట్‌క్లాస్‌వి. మీ ఆవిడ బి.ఏ.లిట్. మీరిద్దరూ శ్రద్ధపెడితే మీ అబ్బాయికి ఆపాటి డిసిప్లినూ, చదువూ నేర్పుకోలేరూ? ఏదో ఓ మామూలు బళ్లో చేర్చి ఇంటిదగ్గర చదివించుకుంటే చాలదూ?

ఆ కాన్వెంట్ సీట్లకోసం, ఆ మాడ్ రాట్ రేస్‌లో....పిల్లల బుర్రల్ని చెడగొట్టి, ఇన్ఫీరియార్టీని వాళ్ళలో పెంచి....ఛ .. ఛ.. ఇలాటివి మనం ప్రోత్సహించకూడదురా! మన పిల్లలకి ఇంటర్వ్యూలు పెట్టి, వాళ్ళు పనికిరానివాళ్లు అని ముద్రలేసి, వాళ్ల తెల్లని జీవితాలమీద పిచ్చిగీతల కత్తికోతలు పెట్టే అవకాశం వాళ్లకెందుకివ్వాలి మనం?

ఆ స్కూల్స్ నిజంగా డిసిప్లిన్ నేర్పేవే అయితే, అక్కడ రికమెండేషన్స్ ఎందుకుండాలి? డొనేషన్లు ఎందుకుండాలి? చదువు పేరుతో వ్యాపారం పెట్టి వేలకివేలు ఘరానాగా దోపిడీ చేయటం కాదూ వాళ్లు చేస్తున్నది?"

"కానీ..మామూలు బళ్ళలో స్టాండర్డ్స్."

"అదే పిటీ! తమ ఆధ్వర్యంలో పని చేస్తున్న స్కూల్స్ అన్నీ సక్రమంగా, సమర్థవంతంగా నడుస్తున్నాయని సర్టిఫై చేసే విద్యాశాఖామంత్రులూ, డి. ఇ. వో ల్లాంటి అధికారులే తమ పిల్లలని మాత్రం ఆ బళ్లకి పంపరు! వాళ్లకి కూడా పబ్లిక్ స్కూల్ లాంటి బళ్ళే కావాలి! ఎక్కడ చూసినా ఇలాటి అవినీతి వుండబట్టే మనదేశం మోక్షం రాక కొట్టుకుంటోందిరా!"

మాట్లాడలేదు అనంతరావు.

"ఒరేయ్ నన్ను తిట్టుకున్నా ఫర్లేదుగానీ, నా మాటల్లోని నిజం ఆలోచించు చాలు! గత దశాబ్దంగానూ నానాటికీ కుళ్లిపోతున్న మన విద్యావ్యవస్థలోని మరో వేరుపురుగే ఈ ఘరానా కాన్వెంట్స్. వాటిలో చేర్చటం మన భావిపౌరుల్ని మరింత సంకుచితులుగా తీర్చి దిద్దటమే!

పొన్లేగానీ, సాయంత్రం ఆఫీసు నించి వచ్చేక తీసుకెళ్ళు రాజుని. అందాకా లలిత చూస్తుంటుంది. బై ది బై, నువ్వూ ఇక్కడే భోంచేసి వెళ్లు ఆఫీసుకి."

తలూపేడు, ప్రకాశం పట్టుదల తెల్సిన అనంతరావు.

* - * *

ఆ సాయంత్రం, ప్రకాశం పగలల్లా ప్రోత్సహిస్తూ చెప్పిన కబుర్లవల్లా లలిత లాలనవల్లా జ్వరం తగ్గి ఆడుకుంటున్న రాజు, తండ్రిని చూడగానే లేచి ఎదురెళ్ళాడు. "నాన్నగారూ,అంకుల్ చెప్పారు-నన్ను బళ్లో చేర్చుకుంటారటగా?"

"ఓ. యస్. కానీ ఆ బడికాదు. అక్కడ పాఠాలు బాగా చెప్పరట. మరో మంచి బళ్లో చేరుదువుగాని. మరి జొరం తగ్గిపోయిందా?" కొడుకొని ఎత్తుకుని చాక్‌లెట్ ఇస్తూ అడిగాడు రావు.

"ఊ" అన్నాడు సంతోషంగా తలూపుతూ రాజు. వాడి బుగ్గమీద ముద్దు పెట్టుకుంటున్న అనంతరావుని చూస్తూ,

"అబ్బ! ఎంత ప్రేమ పుట్టుకొచ్చిందిరా కొడుకు మీద!" అన్నాడు ప్రకాశం నవ్వుతూ. □


ఫోన్ : 24494

మా ఖాతాదారులకు, శ్రేయోభిలాషులకు
దీపావళి శుభాకాంక్షలు

రంగా ఇంజినీరింగు కంపెని
22, మూఖరు నల్లముత్తు వీధి,
మద్రాసు - 600 001.

ది లక్ష్మి ట్రేడింగ్ కంపెని
22, మూఖరు నల్లముత్తు వీధి,
మద్రాసు - 600 001.

విక్రయదారులకు :

ఎలక్ట్రికల్ పి వి సి పైర్లు—కేబిల్సు—బెండులు—స్ప్రింగు లెన్సు కిల్ బరన్—
స్టార్టర్లు—బోర్డ్లు—రీగలు—స్విచ్చులు—ఎలక్ట్రికల్ అనసరీలు